క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ముగ్గురు వ్యక్తులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సోమవారం అందజేశారు. చెక్కులను ఎమ్మెల్యే తన క్యాంప కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోనేందుకే సీఎం సహాయ నిధి ఎంతగానో దోహదపడుతోందని అన్నారు. కార్యక్రమంలో భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి తెల్లం సీతమ్మ, మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి

మణుగూరురూరల్: మండలంలోని ప్రభుత్వ భూములను రక్షించాలని, ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. తొలుత నూతనంగా బాధ్యతలు చేపట్టిన అద్దంకి నరేష్‌ను ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరు మండలంలో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు వాగబోయిన శ్రీను, డివిజన్ ప్రధాన కార్యదర్శి తుర్రం రవికుమార్, మండల అధ్యక్షుడు సోలం హరిశంకర్, ప్రధాన కార్యదర్శి మడి రమేష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

అశ్వారావుపేటరూరల్: సీపీఐని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క సభ్యుడు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌డీ సలీం కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో పట్టణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్వరలో జరిగే మున్సిపాలిటీ, పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని, పార్టీ శాఖల వారిగా సభ్యత్వాలను పెంచాలని అన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించి, పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. అలాగే మున్సిపాలిటీ, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు గన్నిన రామకృష్ణ, పఠాన్ జలాల్, నూకవరపు విజయ్‌కాంత్, జోగిరాజు, ఎస్‌డీ జాకీర్,జక్కం బలరాం, సత్యవతి, సూర్యకుమారి, రసూల్‌బీ, రమాదేవి పాల్గొన్నారు.

ఆదివాసీ పంచాయతీలపై దృష్టి

అశ్వాపురం: ఆదివాసీ పంచాయతీలపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు చేపడుతున్నామని పినపాక నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సూరపరెడ్డి తరుణ్ రెడ్డి అన్నారు. సోమవారం అశ్వాపురం మండలం గొందిగూడెం గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ సెంటర్, ప్రైమరీ హెల్త్ సెంటర్, ఎంపీపీఎస్ స్కూల్, గొందిగూడెం ఆదివాసీ పంచాయతీలోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు సందర్శించారు. అక్కడ కావాల్సిన మౌలిక సదుపాయాలను కాంగ్రెస్ ప్రభుత్వం పొందుపరిచిన ఆల్ ఇండియా ఆదివాసి కాంగ్రెస్ పత్రంలో లిఖించేందుకు ఆల్ ఇండియా ఆదివాసి కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ బుర్కా అశోక్, వైస్ ప్రెసిడెంట్ గొల్లపల్లి నరేష్ కుమార్, నియోజకవర్గ యువజన నాయకులు చాప ప్రవీణ్, గొందిగూడెం మాజీ సర్పంచ్ పాయం భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

అశ్వాపురం: మండల కేంద్రంలోని చింతలచెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన యాదవుల ఆరాధ్యదైవమైన గంగమ్మ తల్లి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. నూతనంగా నిర్వహించిన గంగమ్మ ఆలయంలో గురువారం గంగమ్మ, పోతురాజు విగ్రహాలను ప్రతిష్ఠించారు. సోమవారం ఉదయం నుంచే భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరు కావడంతో జాతర సందడిగా మారింది. యాదవులు కుటుంబసమేతంగా జాతరకు తరలిరాగా.. యాదవ సోదరులు డప్పు వాయిద్యాలతో కాళ్లకు గజ్జెలు కట్టి ఊరేగుతూ సందడిచేశారు. పెద్దఎత్తున మహిళలు ఆదివారం రాత్రి గంపలు ఎత్తుకొని గంగమ్మతల్లి దేవతకు గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చింతల వెంకటేశ్వర్లు, నీలారపు రమేష్, కసర బోయిన వీరన్న, భూతం వెంకటేశ్వర్లు, మద్ది పెద్దిరాజు, బొల్లం ఐలయ్య, భూతం వెంకన్న, ముత్తబోయిన వెంకటేశ్వర్లు, నక్కనబోయిన పాపారావు,గొని ఐలయ్య, దగ్గుల మహేష్, కసనబోయిన రాములు, నక్కన బోయిన నరేష్ నూకల వేణు తదితరులు పాల్గొన్నారు.

చీకట్లు కమ్మిన మణుగూరు



రాత్రివేళ వెలగని సెంట్రల్ లైటింగ్..

- వెలగని సెంట్రల్ లైటింగ్
- దుకాణాల వెలుతురే దిక్కు

మణుగూరుటౌన్: నియోజకవర్గానికి మండల కేంద్రం, సింగరేణి, బీటీపీఎస్, హెవీ వాటర్‌ప్లాంట్ వంటి రాష్ట్ర, దేశ గుర్తింపు పొందిన సంస్థలున్న మణుగూరు ప్రధాన పట్టణం రాత్రయితే చీకట్లోనే మగ్గుతోంది. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ తరచూ మరమ్మతులకు గురి కావడం.. మరమ్మతులు అయిన నెలల తర్వాత నిధులు మంజూరు కావడం బాగు చేయించడం పరిపాటిగా మారింది. ఫలితంగా తరచూ మణుగూరు పట్టణం వీధుల్లో దుకాణదారులు ఏర్పాటు చేసుకున్న లైట్లు ఒక్కటే దిక్కుగా మారాయి. రాత్రి వేళ అయినా, వర్షం పడి విద్యుత్ అంతరాయం ఏర్పడినా చిమ్మచీకట్లో ప్రయాణించాల్సిందే.

నిర్మాణంలో లుకలుకలు..

మణుగూరు ప్రధాన పట్టణంలో మొత్తం సెంట్రల్ లైటింగ్ 59 ఉండగా, వాటిలో 10 పోల్స్‌కు ఉన్న లైట్లు వెలిగే పరిస్థితి లేదు. గతంలో పట్టణ సుందరీకరణలో భాగంగా నిర్మించిన కొత్త డివైడర్లలో సెంట్రల్ లైటింగ్‌కు సరిపోయే ఆర్మ్యార్ వైరింగ్‌ను మరిచి నిర్మాణాలు పూర్తిచేశారు. తర్వాత గాలిలో వేలాడేలా తీగల ద్వారా కనెక్షన్ పునరుద్ధరించారు. దీంతో నాటి నుంచి నేటి వరకు ఎండకు ఎండి, వర్షాలకు తడుస్తున్న వైరింగ్ సమస్యతో సెంట్రల్ లైటింగ్ సమస్య ఉత్పన్నమవడం, వాటిని కొన్ని నెలల తర్వాత పరిష్కరించడం మున్సిపాలిటీ అధికారులకు పరిపాటిగా మారింది. నిత్యం రోడ్లపై సంచరించే పశువులు, భారీ వాహనాల రాకపోకలు, చోరీలు, వాకింగ్ వెళ్లే మహిళలు, బాటసారులను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గానికి మండల కేంద్రంగా ఉన్న మణుగూరు పట్టణంలో ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

టెండర్ దశలో ఉంది



సెంట్రల్ లైటింగ్ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. రూ.16.5 లక్షలు నిధులు మంజూరయ్యాయి. పనులను టెండర్ పిలవడం జరిగింది. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే వేగంగా పనులు చేపట్టి వైరింగ్ సమస్యతో పాటు తరచూ ఏర్పడే లైటింగ్ మరమ్మతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం.

– టి.ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

గ్రామ సభపై గిరిజనుల ఫైర్

దమ్మపేట: సీతారామ ప్రాజెక్ట్ పిల్ల కాలువ భూ సేకరణ నిమిత్తం మండల పరిధిలోని జగ్గారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభను, స్థానిక గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకించారు. సోమవారం గ్రామ సభలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతుండగా.. జగ్గారం గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన నాయకుడు కారం శ్రీరాములు మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో పెసా సభలు నిర్వహించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా గ్రామసభలు నిర్వహించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నిర్మాణ నిమిత్తం 2019లో జగ్గారం పంచాయతీ పరిధిలో భూమిని సేకరించి, ఎకరాకు రూ. 8 లక్షల పరిహారం ప్రకటించిందని, నేటికీ పరిహారంగా ఒక్క రూపాయి కూడా అందించలేదని వాపోయారు. రైతు బంధును కూడా కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన కాలువ కింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపులు చేసేంతవరకు గ్రామ సభలను ఆమోదించబోమని స్పష్టం చేశారు. దీంతో గ్రామసభను అర్ధాంతరంగా నిలిపేసి, అధికారులు వెనుదిరిగారు. ఐబీడీఈ కృష్ణ, ఆర్ఐ వీరాస్వామి, జగ్గారం గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, స్థానిక గిరిజన నాయకులు కట్టా ఎర్రప్ప, కురసం చిన్న రాజు, కనితి వెంకటేశ్వరరావు, ఊకే వెంకటేశు, కల్లూరి రాజేష్, బోడప్ప పాల్గొన్నారు.



గ్రామసభలో అధికారులతో మాట్లాడుతున్న గిరిజన నాయకులు

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి



కరపత్రాలను ప్రదర్శిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

దమ్మపేట: వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించుకోవాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఐవీ శ్రీనివాస రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని చీపురుగూడెం గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునే దిశగా సాగులో అనుసరించాల్సిన నూతన పద్ధతులు, మెళకువలు గురించి వివరించారు. రసాయనిక ఎరువుల మోతాదును తగ్గించి, సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. మునగ పంట సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు గురించి వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు ఎప్పుడు అందుబాటులో ఉంటారని, వారి సేవలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త రాంప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెమ్యూనరేషన్ ఇప్పించండి



వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ సభ్యులు

భద్రాచలంఅర్బన్: కాంట్రాక్టు పద్ధతిన తాత్కాలికంగా పనిచేసిన డీఎస్సీ 2008 అభ్యర్థులకు అందాల్సిన రెమ్యూనరేషన్‌ను వెంటనే ఇప్పించాలని టీపీటీఎఫ్ సభ్యులు సోమవారం భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుటారి రాజు మాట్లాడుతూ.. ఈ అభ్యర్థులను స్కేల్ పోస్టుల్లో నియమించకుండా కన్సాలిడేటెడ్ రెమ్యూనరేషన్‌కే పరిమితం చేయడం , అది కూడా వేసవి సెలవుల్లో టెర్మినేట్ చేయడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో బాధిత ఉపాధ్యాయ ప్రతినిధులు ఎల్.రవి, వి.ముత్యాలరావు, బి.బాబులాల్, బి.కృష్ణకుమారి, బి.చిన్న, ఆర్.రాధాకుమారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదే దారి.. అదే తీరు

- మరోసారి డంపింగ్ యార్డులో ఆస్పత్రి వ్యర్థాలు
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

భద్రాచలంఅర్బన్: జీవవైద్య వ్యర్థాల (బయోమెడికల్ వేస్ట్) నిర్వహణ సక్రమంగా లేకపోవడం ప్రజారోగ్యానికి పెను శాపమయ్యే అవకాశం ఉన్నప్పటికీ భద్రాచలంలోని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ఇవేమీ పట్టవన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రిల్లోని వ్యర్థాలను తీసుకొచ్చి డంపింగ్ యార్డులోనే పడేస్తున్నారు. ఇటీవలే భద్రాచలం కరకట్ట ప్రాంతంలో ఇదే విధంగా ఆస్పత్రి వ్యర్థాలు పడేయటంతో 'మూటల మాటున మెడికల్ వేస్ట్' అనే కథనం ఈ నెల 14న 'సాక్షి'లో ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ స్పందించి సంబంధిత బాధ్యులకు నోటీసులు జారీ చేయాల్సిందిగా డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్‌ను ఆదేశించారు. అయినప్పటికీ అటు బయోవేస్ట్ సేకరించే ఏజెన్సీతో పాటు ఇటు భద్రాచలంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకుల పద్ధతి మారడం లేదు. కొత్తగా డంపింగ్ యార్డులో ఆస్పత్రి వ్యర్థాలను పడేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. జిల్లా అధికారులు స్పందించి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



భద్రాచలం కరకట్ట ప్రాంతంలో కుప్పలుగా పడేసిన ఆస్పత్రి వ్యర్థాలు



డంపింగ్ యార్డులో పడేసిన మెడికల్ వేస్ట్..

జాబ్ మేళా నిర్వహించాలి

మణుగూరుటౌన్: సింగరేణి సహకారంతో నిరుద్యోగ యువతకు మణుగూరులో జాబ్‌మేళా నిర్వహించాలని ఇఫ్టూ ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ నాయకులు మంగీలాల్ మాట్లాడుతూ.. ఆర్జీ–1లో మాదిరిగా మణుగూరులోనూ జాబ్ మేళా నిర్వహిస్తే ఈ ప్రాంత నిరుద్యోగులకు, సింగరేణి భూ నిర్వాసితులకు, ఉపాధి లభిస్తుందన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

బదిలీ కానిస్టేబుల్‌కు సన్మానం



సన్మానిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తూ ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్ జి.హరీష్‌ను మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి ఇన్‌చార్జ్ సీఐ వెంకటేశ్వరరావులు సోమవారం సబ్ డివిజన్ కార్యాలయంలో సన్మానించి, వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీఎస్పీ కార్యాలయ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ సామల వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ రాజ్‌కుమార్, కానిస్టేబుల్ వేణు, హోమ్ గార్డ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు చేయూత

దమ్మపేట: నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి చనిపోగా, మృతదేహానికి అంత్యక్రియలను గౌతం బుద్ద సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దమ్మపేట గ్రామం, అర్బన్ కాలనీకు చెందిన నిరుపేద కంచర్ల ప్రసాద్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గౌతం బుద్ద సేవా సమితి సభ్యులు, మృతదేహానికి తమ సొంత ఖర్చులతో దహన సంస్కారాలను నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు రొయ్యల కుమార్, పాలడుగుల అబ్బులు, అజీమ్, జాను, గణేష్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐయూకేఎస్ ఎన్నిక ఏకగ్రీవం

దమ్మపేట: అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం దమ్మపేటలో నిర్వహించిన ఏఐయూకేఎస్ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా బుర్రా వెంకన్న, ఉపాధ్యక్షుడిగా కల్లూరి కిషోర్, ప్రధాన కార్యదర్శిగా అమర్లపూడి రాము, సహాయ కార్యదర్శిగా బానోత్ ధర్మ, కోశాధికారిగా మాచర్ల సత్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో 13వ వేతన ఒప్పందంలో ఇచ్చిన హామీలను, పెండింగ్ సమస్యలను గుర్తింపు కార్మికసంఘం వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొనె రామారావు, యారం పిచ్చిరెడ్డిలు డిమాండ్ చేశారు. సోమవారం ఐటీసీ పీఎస్‌పీడీలో కార్మికులతో గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఇన్‌టైమ్‌లో అగ్రిమెంట్ పూర్తిచేస్తామని చెప్పి నాలుగేళ్లయిన ఇప్పటి వరకు సమస్యలు పరిష్కరించలేదన్నారు. పర్మినెంట్ ఉద్యోగాల భర్తీని వెంటనే పూర్తిచేయాలన్నారు. ప్రమోషన్ ప్రక్రియను పూర్తిచేయాలని, అర్హులైన కార్మికులందరికీ క్వార్టర్స్ ఇప్పించాలన్నారు. కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రైవేటు ల్యాబ్‌లకు పంపితే చర్యలు

భద్రాచలంఅర్బన్: వివిధ టెస్టులు, స్కానింగ్, ఎక్స్‌రేలు తీయించుకోవడానికి వస్తున్న ఆదివాసీ గిరిజనుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'దేవుడా ఇదేం పరీక్ష' అనే కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. సోమవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో భద్రాచలంలోని ప్రైవేట్ డాక్టర్లతో పాటు ప్రైవేట్ ల్యాబ్ అసిస్టెంట్లతో ఐటీడీఏ పీఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భద్రాచలం ఏరియా ఆస్పత్రికి వస్తున్న ఆదివాసీ నిరుపేదలను వివిధ టెస్టుల కోసం ప్రైవేటుకు పంపుతున్నారని, అక్కడ వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అధిక ధరలు వసూలు చేన్నారని తమ దృష్టి వచ్చినట్లు పేర్కొన్నారు. ఏ పరీక్షకు ఎంత వసూలు చేస్తారో తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని, అర్హత కలిగిన ల్యాబ్ అసిస్టెంట్లు మాత్రమే రక్త పరీక్షలు నిర్వహించేలా చూడాలని సూచించారు. బయో మెడికల్ వేస్ట్‌ను డంపింగ్ యార్డుల్లో వేయడంపై త్వరలో గ్రామపంచాయతీ అధికారులు, వైద్య శాఖ అధికారులతో ఒక బృందాన్ని సర్వే చేయించనున్నట్లు వెల్లడించారు. నర్సింగ్ పూర్తిచేసిన బాలికలకు జీవనోపాధి కల్పించాలని అన్నారు. భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సుదర్శన్, డాక్టర్ రమేష్ చంద్ర, డాక్టర్ స్పందన, ప్రోగ్రాం అధికారి రాము, ప్రైవేట్ ల్యాబ్ యూనియన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్

సాక్షి ఎఫెక్ట్..

సీసీ కెమెరాలకు మరమ్మతులు



సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న దృశ్యం

మణుగూరుటౌన్: గత నెల రోజులుగా మణుగూరుతో పాటు కార్మిక కుటుంబాలు నివసించే పీవీకాలనీల్లో జరుగుతున్న వరుస చోరీలు ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'బాబోయ్.. దొంగలు'అనే కథనం ప్రచురితమైంది. ఈ మేరకు సింగరేణి ఏరియా అధికారులు సోమవారం స్పందించారు. పీవీకాలనీ నుంచి ప్రధాన కూడళ్లలో సీ–టైపు వరకు ఉన్న సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టారు. గతంలో ఏర్పాటు చేసినప్పటికీ కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. దీంతో అధికారులు స్పైక మిషన్ ద్వారా 50 సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి మరమ్మతులకు గురైన వాటిని తొలిగించారు. అన్ని సీసీ కెమెరాలను అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ సింగరేణి అధికారులకు కార్మిక కుటుంబాల రక్షణ పట్ల తీసుకుంటున్న చర్యలపై ధన్యవాదాలు తెలిపారు.

ఆర్టీసీ బస్సు, రోడ్లు ప్రారంభం



కొమరారంలో బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

గుండాల: మండల పరిధిలోని కొమరారంలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆర్టీసీ బస్సును సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఇటీవల నల్లచెలక, శంభునిగూడెం, మటంలంక, జామరగూడెం, గుండాల మండలం కేంద్రంలో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఇల్లందు నుంచి వయా కొమరారం, చెట్టుపల్లి మీదుగా గుండాలకు ఆర్టీసీ బస్సును వేయించినట్లు, ఇందు కోసం ఇప్పటికే ట్రయల్ రన్, మరమ్మతులు పూర్తి చేశామని తెలిపారు. మండలంలో ఇప్పటికే రూ.కోటికి పైగా నిధులు తీసువచ్చి సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని, ఇంకా ఎక్కడెక్కడ రోడ్లు అవసరమో ప్రణాళికలు వేయాలని పీఆర్ డీఈని ఆదేశించారు. అనంతరం ఆళ్లపల్లి మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన రాయిపాడులో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించారు. నాణ్యతతో నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్టీసీ మేనేజర్ దేవేందర్ గౌడ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ వినీత్, ఏఓ వెంకటరమణ, ఎంపీఓ శ్యాంసుందర్ రెడ్డి, సీఐ రవీందర్, ఎస్సై నాగుల్‌మీరా, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తరుణ్, మండల అధ్యక్షుడు ముత్యమాచారి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దారా అశోక్ ముత్తయ్య, ఎస్‌కె.ఖధీర్, అశోక్, కిరణ్, బుచ్చయ్య, చాట్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

ములకలపల్లి: మండల పరిధిలోని తాళ్లపాయ జీపీ కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ కారం సుధీర్‌లతో కలసి సోమవారం లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీపీ పరిధిలో తొలివిడతగా 22 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని, ప్రభుత్వ నియమ నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు మాధురి, రవి, కాంగ్రెస్ నాయకులు శనగపాటి రవి, సురభి రాజేశ్, పాలకుర్తి సుమిత్, స్థానికులు వీరస్వామి, రాజ్‌కుమార్, అనిల్, కీసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపాయలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు


దుమ్మెత్తి పోస్తున్నారు..!

- ఏడాదిన్నర కాలంగా డివైడర్ నిర్మాణ పనులు
- దుమ్ము, ధూళితో సామాన్యులకు తిప్పలు
- ప్రమాదకరంగా గుంతలు


అశ్వారావుపేట: అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పదవీ కాలంలో ప్రతిపాదించిన మండల కేంద్రాల డివైడర్‌లు, సైడ్ డ్రైన్ నిర్మాణాల పనులు నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్నాయి. అశ్వారావుపేటలో ఒకే సారి డివైడర్ నిర్మాణం, రహదారి విస్తరణ, డ్రెయిన్ నిర్మాణం, విద్యుత్ లైన్ల మార్పు పనులు జరగడంతో స్థానికులు అన్ని విధాలుగా ఇబ్బంది పడుతున్నారు. ఏడాదిన్నర కాలంగా నియోజకవర్గ కేంద్రంలో డివైడర్ నిర్మాణం పేరుతో మొదలైన విస్తరణమో.. విధ్వంసమో తెలియదని ప్రజలను దుమ్మెత్తి పోస్తుంటే కాంట్రాక్టర్, అధికారులు మాత్రం ప్రజలపై నేరుగా దుమ్మెత్తి పోసినట్ల ప్రధాన రహదారిని గాలికొదిలేశారు. వరుణుడు అకాల వర్షం కురిపించిన కాసేపు తప్ప అశ్వారావుపేట మొత్తం రహదారి నిర్మాణం దుమ్ము, ధూళితో కప్పడిపోతోంది. అయినా సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్, పాలకులు ఏమీ పట్టనట్లుంటున్నారు. తమ సమస్యలను వెళ్లగక్కితే ఆక్రమించిన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఖాళీ చేయడం కోసం షాపుల ముందు భాగాలను ప్రూనింగ్ చే స్తారనే భయంతో నోరున్న వ్యాపారులు సైతం మిన్నకుండి పోతున్నారు.

సెంటర్‌కో కొలత..

ఆర్‌అండ్‌బీ రహదారి వెడల్పు 100 అడుగులు. నూతనంగా నిర్మించే డ్రెనేజీ బయట గోడ నుంచి అవతలి వైపు డ్రెయినేజీ బయటి గోడకు ఉండాల్సిన దూరం 100 అడుగులు మాత్రమే. కానీ ఒక్కో సెంటర్‌లో ఒక్కో విధంగా కొలతలను మార్చేశారు. ఆక్రమణలను ఎక్కడికక్కడ విడిచిపెట్టారు. బడా వ్యాపారులు, రాజకీయ నాయకుల భవనాలు, షాపుల ఆక్రమణలను విస్మరించారని, సామాన్యులను అమానుషంగా షెడ్లు కూల్చేసి ఖాళీ చేయించారని పలువురు ఆరోపిస్తున్నారు. డ్రెయినేజీ నిర్మాణంలో తీవ్ర తాత్సారం కారణంగా చాలా మంది స్లాబును సొంతంతగా నిర్మించుకున్నారు. ఖమ్మం, భద్రాచలం, రాజమండ్రి రహదారుల్లో ఇసుక, స్టోన్ డస్ట్, సిమెంట్‌లను నివాస గృహాల మధ్య డంప్ చేసి ఏడాదికి పైగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. జనావాసాలకు దూరంగా డంప్‌లను మార్చాలని ప్రజలు కోరుతున్నారు. భద్రాచలం రోడ్‌లో ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకుండా తవ్వి వదిలేస్తున్నారు. వాహనాలు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నాయి. పై విషయాలను ఆర్‌అండ్‌బీ డీఈఈ ప్రకాష్ దృష్టికి తీసుకువెళ్లగా పనులను పర్యవేక్షించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తామన్నారు.



భద్రాచలం రోడ్‌లో ప్రమాద సూచికలు లేని డ్రెయిన్ నిర్మాణ పనులు



తవ్వి వదిలేసిన పైప్‌లైన్ కాలువ